


# ప్రణయంలో ప్రళయం

ఇసుకపల్లి లక్ష్మీ నరసింహశాస్త్రి

"టామీ కమిన్ ... ఏ...టామీ... ఐసే కమిన్...ఎన్నిసార్లంటున్నా కూడా ఆ 'డాగ్' మాట వినిపించుకోకుండానే నడిరోడ్డుమీదికి అతి నిర్లక్ష్యంగా వెళ్ళిపోతోంది.

'టోనీ'కి మహాచెడ్డకోపం వచ్చింది. కసిగా పల్లు పటపట మనిపించాడు.

కిటికీలోంచితొంగిచూస్తున్న శకుంతల, మొహం చిట్లించుకుంటూ 'టోనీ... యూ కమిన్...' అంటూ గదమాయించింది.

అతను కళ్ళు పైకెత్తి, కొరకొర, భార్య కళ్లల్లోకి చూసి, గుటకలు మింగుతూ, లోపలికి మెదలకుండా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు, చేతులు ముడుచుకుని.

అప్పుడే బైటకొచ్చి నిలబడ్డ, పొరుగింటి దంపతులిద్దరూ పకపక నవ్వుకున్నారు.

ఆ నవ్వులు, టోనీ చెవుల్లో వికటంగా ప్రతిధ్వనించినాయి. చేతిలోకి తీసుకోబోతున్న పేపరును గట్టిగా నేలమీదికేసికొట్టి, భీకరంగా వుండిపోయాడు.

రెండుచేతుల్తోనూ, రెండు ప్లేట్లను, మేరీ తీసుకొచ్చి టోనీముందర పెట్టి, గిర్రున వెనక్కు తిరిగింది.

'ఐసే ... టేక్ దెమ్ బాక్...' గట్టిగా అరిచి తలపైకెత్తేటప్పటికి, మేరీ వెనకాలే శకుంతల కనిపించింది. తల చప్పున కిందకు వంచేసుకుని, మెల్లిగా ఎడంచేత్తో ఒక ప్లేటును దగ్గరకు తీసుకుంటూ బుసకొడుతున్నాడు టోనీ.

శకుంతల, క్షణంసేపు అట్లాగే నిలబడి, టోనీ రెండో ప్లేటు కూడా దగ్గరకు తీసుకున్నతర్వాత లోపలికి వెళ్ళి పోయింది. మేరీకి బాగా ధైర్యం వచ్చేసింది. గబగబ ఓ గ్లాసెడు నీళ్లు, టీ కప్పు విసురున తెచ్చి, టోనీ చూసేటట్టుగా, గట్టిగా ముందరగా పడేసినట్లు పెట్టేసి, మరీ వెళ్ళిపోయింది. టోనీకి యింకా అహం బాగా దెబ్బతిన్నది. పెద్దగా నిట్టూర్చుస్తూ, ప్లేట్లు ఖాళీచేసి ఒక్క గుటకలో టీ కాస్తా తాగేశాడు. అతనికి వళ్ళు మండిపోతోంది. అయితే యిది మొదటిసారికాదు. రోజుకు యిలాంటివి యెన్నో రకాలుగా, యెన్నో తడవలు జరుగుతూనే వుంటాయి. ఎప్పటికప్పుడు సర్దుకుపోదామని అనుకుంటూనే వుంటాడు. కాని ఆ క్షణానికి మాత్రం, యిట్టే మరిచిపోతాడు. కోపం వచ్చేస్తుంది. అహంకారపడతాడు. ఆవేశపడతాడు. మళ్ళీ అన్నీకూడా సమసిపోతూనే వుంటాయి.

అతనికిమాత్రం, మాటిమాటికి గుర్తొచ్చేదల్లా ఒకటే. ఆనాడు సరిగ్గా, అయిదేళ్ళ క్రిందట, తాను మొదటిసారిగా శకుంతలను కలుసుకున్నప్పుడు, 'ఐ లవ్‌యూ' అని ఓ చీటీ పంపించటం, దాంతో రెండుకుటుంబాలవారు, పెద్ద యుద్ధం జరపటం, ఓనాడు, అమాంతం, అర్ధరాత్రి, సినిమాలో, నాయికానాయకుల్లాగ, శకుంతల, తాను యింట్లోంచి మాయమయిపోవటం, యిద్దరూ తర్వాత, 'రిజిస్టర్డ్ మారేజ్' చేసుకోవటం. ఆనాడు తాను చేసిన బాసమాట గుర్తుకొచ్చి, పిచ్చెత్తినవాడిలాగ జుట్టంతా పీక్కున్నాడు.


'నేను మా తల్లితండ్రుల్ని కాదని, నీకోసం వచ్చేశాను. నిన్ను పెళ్ళిచేసుకుంటున్నాను. ఇహ, నేను చెప్పినట్లే నువ్వినాలి...' అన్నది శకుంతల.

'ఇదిగో ప్రమాణంచేస్తున్నాను... ఇహనుంచి నువ్వు చెప్పినట్లే నేవింటాను ...' చేతిలో చెయ్యివేసిన టోనీకి, బాగా కంపరం పుట్టుకొస్తోంది.

ఆ రోజు అలాంటిది. అట్లాగే గడిచిపోయింది. ఇహ అప్పటినుంచే మొదలు టోనీ పాట్లు.

అవన్నీకూడా చీటికి మాటికి గుర్తొచ్చి, కలవరపడిపోతూ వుంటాడు. అందుకనే టోనీ వెనక్కు తగ్గుతూ వుంటాడు. గట్టిగా వాదించడు. విసురుగా మాట్లాడడు. ఎన్నెన్నిసార్లు దూకుడుగా ఆలోచించినా, తీరా శకుంతల కనిపించేటప్పటికి మెత్తబడిపోతాడు.

మెల్లిగా భార్య వెనకాలే నిలబడి, ఆమె వీపుమీద తన కుడిచేతి చూపుడు వేలుతో, అతి నాజూకుగా తట్టాడు. ఆమె ఉలిక్కిపడి, యిట్టే వెనక్కు తిరిగింది. భర్తను చూస్తూ, మొహం వెడల్పు చేసుకుని, కిలకిల నవ్వుతూ,



అమాంతం, అతన్ని కౌగలించుకుని గట్టిగా ముద్దుపెట్టుకుంది.

'మమ్మీ, డాడీని ముద్దుపెట్టుకుంది ...' అంటూ జాన్, సరస్వతులిద్దరూ, వచ్చీరాని మాటలతో, చప్పట్లు కొడుతూ నవ్వుకుంటున్నారు.

మేరీ అయితే నవ్వాపుకుంటూ, చర చర అక్కడినుంచి వెళ్ళిపోయింది.

'షటప్...హుష్...' శకుంతల పిల్లలిద్దర్నీ కోపపడింది, కళ్ళు పెద్దవి చేసుకుంటూ.

'యూ ఆర్ వెరీ బ్యూటిఫుల్...' భార్యను పొగుడుతున్నాడు.

శకుంతల పకపక నవ్వింది.

'ఒక్క మాట...వన్‌వర్డ్'...ఊగిపోతూ అన్నాడు టోనీ.

ఏమిటన్నట్లు కనుబొమ్మలు పైకెత్తింది శకుంతల.

'ఎన్నైనాఅను నన్ను, నాకేం ఫరవా లేదు...ఇతరుల యెదుట మాత్రం నన్నేమీ అనొద్దు...అంతకంటెయేంలేదు ...దట్సాల్...' మొహం వెడల్పు చేసుకుని, భార్య కళ్ళల్లోకి సూటిగా చూశాడు టోనీ

'వాట్!...నాన్సెన్స్!...' కసిరికొట్టినట్లు అతని కళ్ళల్లోకి, సూటిగా చూసింది.

ఇంతలోకి ఆ 'డాగ్' వాకిట్లోంచి లోపలికి వస్తోంది. 'టామీ కమిన్' అన్నది, శకుంతల.

అది గబగబ, తోకాడించుకుంటూ, ఆమె చుట్టూ ప్రదక్షిణంచేస్తూ, కూని రాగాలు తీస్తోంది.

దాని తలను నిమురుతూ, 'మేరీ, టామీక్కూడా నాస్తా తీసుకురా' అన్నది సహజంగానే శకుంతల.

టోనీ చివాలునలేచి, రెండుచేతు ల్తోనూ, తలుపులను గట్టిగా బాదేసి, మేరీని చూడకుండానే, తలవంచుకుని వరండాలోనికి వెళ్ళిపోయాడు.

ఏమిటీ యీ పిచ్చి అనుకుంది శకుంతల.

జాన్. సరస్వతులిద్దరూ, బొమ్మల పుస్తకాల్ని చూస్తూ కబుర్లు చెప్పుకుంటు న్నారు. వరండాలో నిలబడ్డవాడల్లా, యిట్టే పిల్లలదగ్గరకు వచ్చేసి, గభాలున సరస్వతి మొహాన బొట్టును గట్టిగా చేత్తో తుడిచేశాడు, టోనీ.

అ'మ్మతో చెప్తా!...' అంటూ ముద్దుముద్దుగా మారాము చేస్తోంది సరస్వతి.

అబ్బ! నీకూడా యెంత అలు సయిపోయాను. అనుకున్నాడు టోనీ.

'ఏముంది అమ్మతో చెప్పటానికి, నీకు బిస్కట్లు కావాలి అంతేగా...' అంటూ గభాలున ఓ పాకెట్ చేతిలో పెట్టాడు.

సరస్వతి, తండ్రివళ్లో కూర్చుని, బిస్కట్లు తింటూ 'డాడీ చాలా మంచి వాడు' అంటోంది.

టోనీ మురిసిపోయాడు.

బిస్కట్ల పాకెట్ ఖాళీ అయిపోగానే 'టాటా' అంటూ వళ్ళోంచి దిగి, 'అమ్మతో చెప్తా' అంటూ తుర్రున లోప లికి పరుగెత్తింది సరస్వతి.

టోనీ గొంతు చించుకుని అరిచాడు. అప్పటికే తల్లిని చుట్టేసుకుంది లోపలి కెళ్ళి.

'డాడీ!...'అంటూ జాన్ తండ్రి దగ్గరకువచ్చి, ఏదో చెప్పబోతుంటే 'గెటవుట్' అని గదమాయించాడు.

వాడు ఉలిక్కిపడి, ఏడుస్తూ, మమ్మీ ...మమ్మీ' అంటూ లోపలికివెళ్ళాడు.

'మళ్ళీ ఏమొచ్చింది మమ్మీకి... 'అమ్మ' అనమని ఎన్నిసార్లు చెప్పినా నువ్వనవుకదూ...మమ్మీట మమ్మీ, వెధవ బుద్ధులూ నువ్వూనూ...' అంటూ వీపుమీద కొంచెం గట్టిగా చరిచింది.

'డాడీ!...' అంటూ ఏడుస్తూ, తండ్రిదగ్గరకు వచ్చేశాడు జాన్.

టోనీ కొడుకును దగ్గరకు తీసుకుని, 'డోన్ట్ వీప్...ఐసే...డోన్ట్ క్రై...' గట్టిగా మందలించాడు.

ఆ అరుపుకు జాన్ స్తబ్ధుడయి పోయాడు.

'అయితే నాకిష్టంలేనిపని చెయ్య టమే నీకు సరదా అన్నమాట...' శకుంతల, టోనీ ముందు నిటారుగా నిలబడింది.

టోనీకూడా గౌరవసూచకంగా నిల బడ్డాడు. వీళ్ళిద్దరిమధ్య, కళ్లుతుడుచు కుంటూ జాన్ గుటకలువేస్తున్నాడు. సరస్వతి బెరుకుగా, తల్లిచాటున నిలబడి




తండ్రివంక చూట్టానికి ప్రయత్నం చేస్తోంది. తండ్రి కనపడగానే, భయంతో వెనక్కు తగ్గుతోంది.

టోనీ అట్లాగే నిలబడిపోయాడు. ఏమీ మాట్లాడలేదు. శకుంతల కూడా, సమాధానంకోసం నిరీక్షించకుండానే, సరస్వతిని ముందుకులాగి, యింతబొట్టు మొహానపెట్టి, 'పద నీయిష్టం వచ్చినట్టు తిరుగు' అంటూ ముందుకు నెట్టింది, తానేమో లోపలికి వెళ్ళిపోయింది.

గంతులేసుకుంటూ ధైర్యంగా, తండ్రిదగ్గరకు వెళ్ళింది. కూతుర్ని దగ్గరకు తీసుకుని, తలనిమురుతూ 'దొంగ చెప్పావుకదూ' అన్నాడు ఆప్యాయంగా టోనీ.

నీటుగా ఒళ్లుసాగదీసుకుంటూ నవ్వుతోంది సరస్వతి. జాన్‌మాత్రం, ఆరిందాగా డాడీమీద నేరాలుచెప్పెచ్చా అని చెల్లెల్ని కసురుతున్నాడు.

పొద్దు వాలిపోతోంది. టోనీ అట్లాగే కూర్చుని, ఏవేవో ఆలోచించుకుంటూ, విలవిలలాడిపోతున్నాడు. మనస్సు ఆరాటపడుతోంది. హృదయం దహించుకుపోతోంది. చుట్టూ అంతా చీకటి అలుముకుపోతోంది. అతని ఆలోచనల్లో టైము తెలియలేదు.

ఇంతలోకి మేరీ బెరుకుగా ఒదిగి, ఒదిగి వచ్చి, టోనీముందర నిలబడింది. కాళ్ళచప్పుడు వింటూకూడా, అతను తలెత్తలేదు. సరిగా తనముందుగా వచ్చి నిలబడేటప్పటికి యిహ తప్పనిసరయి, ఏమిటన్నట్లు, అమె మొహంలోకి చూశాడు తలెత్తి, విసుగా.

'మేడమ్ రమ్మంటోంది...' కీచు గొంతుకతో అన్నది మేరీ. పెద్దగా నిట్టూరుస్తూ, బద్ధకంగాలేచి, ముందుకు సాగాడు. శకుంతల, గదిలో నిలువుటద్దంముందు అర్ధనగ్నంగా నిలబడి

మేకప్ చేసుకుంటోంది. టోనీ, యిట్టే చూసి, గభాలున వెనక్కుతగ్గి, 'శకుంత లేగా' అనుకుని, ముందుకు అడుగు వేశాడు.

భర్త వెనకాలే వున్నట్టు, అద్దంలో చూసికూడా, శకుంతల, నదురూ, బెదురూ లేకుండా అట్లాగే అలంకరించు కుంటోంది.

"పిల్లలొస్తారేమో తలుపెయ్యి" అన్నది కనుబొమ్మల్ని తీర్చిదిద్దుకుంటు భర్తవైపుకు తిరక్కుండానే.

"టామీ గెటవుట్..." అద్దంలోంచే సంజ్ఞచేసింది. ఆ డాగ్ తలవంచుకుని, తోకాడిస్తూ, బైటకు వెళ్ళిపోయింది. టోనీ తలుపులు బిగించేశాడు. ఆమె వంకే అద్దంలోనేచూస్తూ అట్లాగే నిలబడి పోయాడు.

"నేనెందుకు రమ్మన్నానో తెలుసా..." కిలకిల నవ్వింది శకుంతల.

"తెలీకే, తెలుస్తూనేవుంది..." అతి నాజూకుగా అంటానికి ప్రయత్నం చేశాడు.

చివాలున, భర్తవైపుకు తిరిగి, నిశ్చలంగా అతని కళ్లల్లోకి వాడిగా చూస్తూ, యిట్టే కళ్ళు పెద్దవిచేసింది. ఆమె మొహంలో ఉద్రేకభావాలు వెల్లివిరిసి నాయి. టోనీ బిత్తరపోయి ఆమెవంకే విడ్డూరంగా చూస్తున్నాడు.

ఇట్టే, అతన్ని, రెండుచేతులూ పట్టుకుని, తనవైపుకు లాక్కుంది. అతను యాంత్రికంగా చాలా దగ్గరకు వచ్చేశాడు.

చాలాసేపటి వరకు ఒకరితో ఒకరు మాట్లాడనేలేదు.

'నువ్వు చెప్పిందల్లా వింటూనే వున్నా, నువ్వు చెయ్యమన్నదల్లా చేస్తూనే వున్నా...' ఆ సమయంలో తాను ఏంచెప్పినా వింటుందనే ధీమాతో చెప్పుకుపోతున్నాడు టోనీ.

'అవునా...'

'అవును...'

'మరి నాకు మనస్సుంటుందా...'

'ఊ......'

'అభిమానం వుంటుందా...'

'ఆ...'

'గౌరవ మర్యాదలుంటా యంటావా...'

'ఉంటాయి...'

'ఎంతైనా నేను మగవాన్ని గదా...'

'అందుకనేగా నిన్ను పెళ్ళిచేసుకుంది...' చివాలున లేచి కూర్చుంది మంచంమీద శకుంతల.

అదిరిపడ్డాడు టోనీ.